క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 38 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్టు వరహాలమ్మ

రోలుగుంట: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శరభవరంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 52 మందిని ఆప్తాలమిస్టు వరహాలమ్మ పరీక్షించారు. వారిలో ఎంపిక చేసిన 38 మందిని శస్త్రచికిత్సలకు ఆదివారం ప్రత్యేక వాహనంపై విశాఖ తీసుకెళ్తామని క్యాంపు కో–ఆర్డినేటర్ సిహెచ్. అశ్వనీకుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దోసపత్ని రాజు, పంచాడ చినరాయుడు సహాయ సహకారాలందించారు.

వైభవ రథయాత్రకు ఘన స్వాగతం



వైభవ యాత్రకు స్వాగతం పలుకుతున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: వేంకటేశ్వర వైభవ యాత్ర శుక్రవారం నర్సీపట్నం చేరుకుంది. ఈ యాత్రకు వాసవీక్లబ్ ప్రతినిధులు వెలగా నారాయణరావు తదితరులు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. పట్టణ పురవీధుల్లో వెళ్లిన స్వామి వారి రథాన్ని ప్రజలు సందర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి బయల్దేరి ఏపీలోని 250లకు పైగా వేంకటేశ్వర ఆలయాలను అనుసంధానిస్తూ వైభవ యాత్ర కొనసాగుతుందని నారాయణరావు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ఫిట్ ఇండియా వీక్ సందర్భంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. నిత్యం యోగా చేయాలని హెచ్‌ఎం రాము సూచించారు. ఇలా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని, మానసిక ప్రశాంతత కలుగుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనలో డిప్యూటీ సీఎం



సహ పంక్తి భోజనాలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కార్తీక వనసమారాధనలు ఐకమత్యానికి ప్రతీకని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మారేపల్లి సమీప తోటలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. తన సతీమణి రమణమ్మతో కలిసి ఆయన ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. స్థానికులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటకు మద్దతు ధర

కె.కోటపాడు: మేలైన యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు మరింతగా అవగాహన కల్పించొచ్చని గుంటూరుకు చెందిన ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ పరిశీలకుడు డాక్టర్ రవి తెలిపారు. వారాడ, చిరికివానిపాలెం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంట ఉత్పత్తుల శాంపిళ్లను శుక్రవారం ఆయన సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు గుర్తించి పంట ఆరోగ్య గుర్తింపు ఇస్తామన్నారు. అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్, చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్, ఏవోలు సోమశేఖర్, చిరంజీవి, ఏఈవో లైలాదేవి పాల్గొన్నారు.

అమ్మ లాలన.. అంగన్‌వాడీ బోధన



- గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ
- గతం కంటే మెరుగైన పౌష్టికాహారం
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో ఆరోగ్యం

మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు : 97 , సొంత భవనాల్లో ఉన్నవి : 36
అద్దె భవనాల్లో ఉన్నవి : 37 , కమ్యూనిటీ హాలులో కేంద్రాలు (అద్దె లేకుండా) : 24
మంజూరైన నూతన భవనాలు : 4 , ఒక్కొక్క భవనానికి అయ్యే వ్యయం : రూ 12 లక్షలు
మండలం మొత్తం చిన్నారుల సంఖ్య (0- 6 ఏళ్లలోపు వారు) : 3,532
గర్భిణులు : 363 , బాలింతల సంఖ్య : 417



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలు నేర్పుతున్న కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మకు ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. బుడిబుడి అడుగులేసే చిన్నారులను ఆటపాటలతో లాలిస్తున్నాయి. అమ్మలా అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయి. బాలింతల, గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. నాణ్యమైన పౌష్టికాహారంతోపాటు మెరుగైన వైద్య సేవలందేలా చూస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అన్ని రకాల చర్యలు తీసుకోవడంతో ఇదంతా సాధ్యమైందని లబ్ధిదారులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రీ స్కూలుకు వచ్చేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

– మాడుగుల రూరల్



వైఎస్సార్ పోషణ కిట్లు, గుడ్లు తీసుకున్న గర్భిణులు

పౌష్టికాహారం వివరాలు

(7 మాసాల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు)
1. రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్లు
2. ఆరు లీటర్ల పాలు
3. 30 కోడి గుడ్లు

(3 నుంచి 5 సంవత్సరాల వరకు)
వారంలో సోమవారం నుంచి శనివారం వరకు రోజూ మధ్యాహ్నం అన్నం, పప్పు, ఆకుకూర, కాయగూరలు, పప్పుతో కూర, ఉడికించిన గుడ్డు, సాయంత్రం 3.30 నిమిషాలకు రెండు వందల మిల్లీలీటర్ల పాలు, దీనితోపాటు అదనంగా మంగళ, శనివారాల్లో పులిహోర, వెజిటబుల్ రైస్ పౌష్టికాహారంగా అందుస్తున్నారు.

గర్భిణుల, బాలింతల మెనూ వివరాలు :
సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి 15 రోజులుకొక పర్యాయం ఇంటికే (టేక్ హోమ్ రేషన్) పౌష్టికాహారం ఇస్తారు.
బియ్యం : 3 కిలోలు
కందిపప్పు: 1 కిలో
ఆయిల్ : అర కిలో
గుడ్లు : 25
పాలు : 5 లీటర్లు

వైఎస్సార్ పోషణ కిట్లుగా అందించేవి..

గోధుమ పిండి : 2 కిలోలు
చోడిపిండి : 1 కిలో
బెల్లం: అర కిలో
ఎండు ఖర్జూరం : అర కిలో
వేరు శనగ చెక్కీలు : అర కిలో

వినూత్న రీతిలో విద్యా బోధన...

3, 4 సంవత్సరాల చిన్నారులకు పీపీ -1 పుస్తకాల ద్వారా ఆంగ్ల బోధన, 4 నుంచి 5 సంవత్సరాల వయసు వారికి పీపీ- 2 అర్థమయ్యే రీతిలో విద్యాభ్యాసం, స్పోకెన్ ఇంగ్లిషు చేస్తున్నారు. ఆంగ్ల వర్క్ బుక్, డ్రాయింగ్ బుక్, లెక్కలు నేర్పిస్తున్నారు. వస్తువులను చూపించి సంఖ్య వివరాలను అడిగి తెలుసుకోవడం వంటి వినూత్న రీతిలో అంగన్‌వాడీ కార్యకర్తలు బోధిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు బీసీజీ టీకాలు, మిజిల్స్, విటమిన్ ఏ సిరప్‌లతోపాటు రక్తహీనత నివారణకుగాను, రేచీకటి రాకుండా బూస్టర్ డోసులు వేస్తున్నారు.



కె.జె.పురంలో -2వ అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఆర్థిక భారం తగ్గింది..



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ మంచి పౌష్టికాహారం పొందుతున్నాం. గర్భిణిగా నా పేరు నమోదైనప్పటి నుంచి ఇటు వైద్య సిబ్బంది, అటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు అనునిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రాల ద్వారా టేక్ హోమ్ రేషన్ (టి.హెచ్.ఆర్) అందిస్తున్నారు. వైఎస్సార్ పోషణ కిట్లతోపాటు పాలు, గుడ్లు అందించడం వల్ల మాలాంటి పేద గర్భిణులకు ఆర్థిక భారం తగ్గింది.

– కాళ్ల చంద్రిక, గర్భిణి, కె.జె.పురం, మాడుగుల మండలం

నిరంతరం పర్యవేక్షణ..



మాలాంటి బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలంటే కొంచెం ఇబ్బందిగా ఉంటోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మా ఇంటి వద్దకే రేషన్ పంపిస్తోంది. గతంలో కేంద్రానికి వెళ్లి రేషన్ తీసుకోవాలంటే సాధ్యమయ్యేది కాదు. ఇప్పుడు ఇంటికే వచ్చి ఇవ్వడం వల్ల మాకు ఎంతో ఆనందంగా ఉంది. వాటిని నచ్చిన విధంగా ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చు. వీటితోపాటు నిరంతరం తల్లీబిడ్డ సంరక్షణ ఉంటోంది. నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

– బుద్ద నాగభారతి, బాలింతరాలు, కె.జె.పురం, మాడుగుల మండలం

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులతో కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సభ్యులంతా తీర్మానం చేశారు. ఈ విషయమై వేములపూడి ఎంపీటీసీ బోళెం రామ్‌ప్రసాద్ తొలుత లేవనెత్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తే సమస్యలపై అధికారులు సమగ్రమైన సమాచారం ఇవ్వాలన్నారు. అధ్వాన రోడ్లను మెరుగుపరచాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఐసీడీఎస్‌కు సంబంధించి గబ్బాడ సెక్టారు సూపర్‌వైజర్ ఇప్పటి వరకు తమ గ్రామానికి ఒక్కసారి రాలేదని గురందరపాలెం సర్పంచ్ శానపతి వెంకటరత్నం సభ దృష్టికి తీసుకెళ్లారు. వైస్ ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం, ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ధర్మసాగరం ఎంపీటీసీ పెట్ల అచ్చియ్యనాయుడు కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు మంజూరైంది. ఆయన ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతడి కుటుంబం ఆర్థికంగా దీనస్థితిలో ఉండటంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు కావడంతో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మృతుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ తాతబాబు, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ పెట్ల అప్పలనాయుడు, మాకిరెడ్డి సత్తిబాబు, సుర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో, వైద్యాధికారులు

మాకవరపాలెం: రక్తహీనత నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో మూర్తి, వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. రక్తహీనత నివారణపై శుక్రవారం గిడుతూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు. అనంతరం రక్తహీనత నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు టీచర్ల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఇక్కడ రెండో రోజు రిసోర్స్ పర్సన్లు ఎం.నాని, శ్రీరామ్మూర్తి విద్యార్థుల్లో సృజనాత్మక బోధన ఎలా వెలికి తీయాలి, ప్రయోగ పద్ధతిలో పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు జానుప్రసాద్, జగ్గారావు, హెచ్‌ఎం వరప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: జగనన్న లేఅవుట్‌ల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ సుబ్బారాయుడుపాలెంలో జగనన్న లేఅవుట్‌కు మెయిన్ రోడ్డు నుంచి చెరువుగట్టు మీదుగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయక కాలనీ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని వార్డు ఇన్‌చార్జి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఆమె వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, కమిషనర్ పూడి రవిబాబు, డీఈ నారాయణ జగనన్న కాలనీని పరిశీలించారు. అప్రోచ్ రోడ్డుతోపాటు కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని కమిషనర్‌కు సూచించారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం



కందిపూడిలో సచివాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ భవనాల నిర్మాణాల పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డీపీవో శిరీషారాణి తెలిపారు. శుక్రవారం ఆమె బుచ్చెయ్యపేట, చిన కందిపూడి, పెద కందిపూడి తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ భవనాల పనులను, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. హాజరు పట్టికలను పరిశీలించి పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సువర్ణరాజు, జేఈ ప్రభ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి



ఎ. కొత్తపల్లిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం



నర్సీపట్నం: ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



మాడుగుల: వీరనారాయణంలో కరపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు రాజారామ్



మాట్లాడుతున్న రావికమతం ఎంపీపీ రాజు



నాతవరం: మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నేత అచ్చియ్యనాయుడు



బుచ్చెయ్యపేట: చింతపాకలో ప్రభుత్వ సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

నర్సీపట్నం: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీ -2వ సచివాలయంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్ చెక్కా బాలమ్మ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

యరకన్నపాలెంలో...
సర్పంచ్ నారాయణమ్మ ఆధ్వర్యంలో యరకన్నపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

కె.కోటపాడు: అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఎ.కోడూరులో సంక్షేమ, అభివృద్ధి నిధులకు సంబంధించిన బోర్డును మాడుగుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఉరుకూటి అప్పారావుతో కలిసి ఆవిష్కరించారు. జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, ఎంపీటీసీ లెక్కల గౌతమి, గ్రామ పార్టీ కన్వీనర్ బొడ్డు ప్రకాసి, శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ పాటూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రావికమతం: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం చీమలపాడులో నిర్వహించారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, సర్పంచ్ వంజరి గంగరాజు, ఎంపీటీసీ చిన్ని చినమ్మలు, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు.

దేవరాపల్లి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఏ.కొత్తపల్లిలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం ఆవిష్కరించారు. రాత్రికి అక్కడే భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ఉర్రూకుల అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల/రూరల్: తాటిపర్తిలో గురువారం రాత్రి పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పల్లె నిద్ర చేశారు. శుక్రవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అవురువాడ వీరనారాయణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, ఎంపీటీసీ బగుడు సీతారామయ్య పాల్గొన్నారు.

రోలుగుంట: అడ్డసరంలో శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఎంపీటీసీ వడ్డాది సతీష్, నాయకులు విస్సారపు కృష్ణ, రామునాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ ప్రెసిడెంటు గొర్లె వెంకటరామన్ పార్టీ జెండా ఎగురవేశారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. నాయకుడు పాచిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: ప్రతి నిరుపేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యంగా సీఎం పాలన కొనసాగుతుందని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. శుక్రవారం బైలపూడి, వరహాపురం, తునివలస పంచాయతీల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేసి వివరించారు. సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, డి.సురవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నందారపు రమణబాబు, బైలపూడి, ఎ.అగ్రహారం సర్పంచ్‌లు ధనలక్ష్మి, సలాది ధనలక్ష్మి, గంగశేషు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. బూరుగుపాలెంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలిసి అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి, పనుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజారావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, పార్టీ నేతలు పెట్ల భద్రాచలం, భీమిరెడ్డి గోవిందరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: చింతపాకలో సంక్షేమ, అభివృద్ధి వివరాలతో కూడిన బోర్డును జెడ్పీటీసీ దొండా రాంబాబు ఆవిష్కరించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్‌లు గొలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, చింతల కోటీశ్వరరావు పాల్గొన్నారు.

నాతవరం: సర్పంచ్ మిరపల వెంకటరమణ అధ్యక్షతన పెదగొలుగొండపేట సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పనులు బోర్డును ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, సర్పంచులు గుడపర్తి సీతయ్యమ్మ, అంకంరెడ్డి నూకాలమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బవరపు వెంకునాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, ఎ.వరహాలబాబు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం/చోడవరం/కె.కోటపాడు/దేవరాపల్లి: అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు కావాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం పిలుపునిచ్చారు. ఓటు నమోదు అవశ్యకతపై నర్సీపట్నంలో శుక్రవారం అధికారులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చోడవరం, కె.కోటపాడు, దేవరాపల్లిలో నిర్వహించారు.